
కథ

# "ఉత్తరాల చురకలు"

పి.పి. వరప్రసాద్‌రావు



ప్రియమైన అన్నగారికి,

మీ తమ్ముడు సదానందం నమస్కరించి వ్రాయునది. ఇక్కడ అంతా క్షేమం. అక్కడ మీరు, వదిన, పిల్లలు క్షేమమని తలుస్తున్నాను.

వదిన రాసిన ఉత్తరం చేరింది. ఆ ఉత్తరంలో వదిన చెప్పినట్లే ఈసారి ధాన్యమంతా కల్లంలోనే అమ్మేశాను. మళ్ళీ ఇంటికి తీసుకొస్తే తరుగు ఎక్కువయిపోతుంది కూడా.

పుట్టి మువ్వయి నాలుగు వందల దాకా తీసుకొంటా మన్నారు. అంతకు మించి తూగలేదు. మొత్తం ధాన్యం కరణంగారి కమ్మాను. తొమ్మిది పుట్ల మీద మొత్తం మువ్వయి వేల ఆరొందల రూపాయలు వచ్చే గురువా రంనాడు ఇస్తానన్నాడు.

ఇక అంత డబ్బు ఎలా వంపాలో తెలీడం లేదు. నన్ను వంపమంటారా... లేదు మీరెవరైనా వస్తారా... లేకుంటే నన్నే తీసుకు రమ్మంటారా తెలిపేది. డబ్బు అర్జంటుగా కావాలి అని వదిన రాసింది కదా.

హైదరాబాదంటే నాకు గుండె దడ. అక్కడ రోడ్డు దాటాలంటేనే అరపూట గడిచిపోద్దని ఇక్కణ్ణుంచి వని చేయడానికి హైదరాబాద్ వచ్చే బేల్దారీ మేస్త్రీలు చెప్తుంటారు.

పెద్దది సరోజకి పెళ్ళి కుదిరింది. ఊళ్ళో సంబధమే. వది సవర్ల బంగారం పెట్టి ఇరవై వేల కట్నం ఇవ్వమ న్నారు. కాదు కూడదంటే పెద్ద మనుమలు కలగ చేసుకుని వది నవర్ల బంగారం, వదేను వేల డబ్బు అని నచ్చచెప్పారు. అవుడయితే సరే అన్నాను గాని అంత బంగారం, అంత డబ్బు ఎక్కణ్ణుంచి తెచ్చేదో అర్థం గావట్లేదు.

పొలం అమ్మేద్దామని మీ మరదలంటుంది. ఉండేదే అరెకరం. అదమ్మేస్తే కడుపుకేం తినాలన్జెప్పి వద్దన్నా ను. అంతగియితే మీ పొలం ఎలా ఉంటుంది గదా అందులోనే కౌలు చేసుకొని తిందాం అని దాని ఆలోచన.

పిల్ల పెళ్ళి జరుగుతుందో, నిలిచిపోతుందో అని భయంగా ఉంది. ఈ పరిస్థితిలో నాయన ఉండున్నా కొంత అండగా ఉండేవాడు? పెద్ద దిక్కు అంటూ ఎవరూ లేకపోయినారు. ఆ ఎలితి ఇప్పుడు తెలుస్తా ఉంది.

ఒక్కోసారయితే కళ్ళకి నీళ్ళొస్తుండాయి. మగ పుటక పుట్టి ఏడుస్తున్నాడంటారని దుఃఖం మింగేస్తున్నాను. పెళ్ళి రోజు రోజుకీ దగ్గర వస్తా ఉంది.

నువ్వు, వదిన వచ్చి కూడా పదేళ్ళకి పైగా అయిపోతా ఉంది. నేను రావాలని అనుకోడమే గాని ఏడాదికేడాది అట్టాగే గడిచిపోయింది. చిన్నదయితే నీ గురించి ఊరికే అడుగుతూ ఉంటుంది 'పెద్దనాన్న ఎట్టా ఉంటా డు... పెద్దనాన్న ఎట్టా ఉంటాడు... పెద్దనాన్న పేద్ద ఆఫీసరు... ఆఫీసులో ఉంటాడు' అని చెప్తాంటాను. మీరిద్దరూ ఓసారి ఊరికొస్తే నాకెంతో గుండె ధైర్యంగా ఉంటుంది. నలుగురిలో కొంచెం ప్రతిష్ఠగానూ ఉంటుంది.

అవసరం వచ్చి పిలుస్తున్నానని అనుకోవద్దని వదిన కి చెప్పేది. వీలయితే ఓ పదివేల రూపాయలు అప్పుగా ఇస్తే వడ్డీతో సహా వచ్చే పంటల బైముకి తీర్చేస్తాను. ఈ విషయం వదినకి కూడా నచ్చ చెప్పి ఏ విషయం రాయగలవు. అలా ఇస్తే పిల్ల పెళ్ళి గట్టెక్కినట్లవు తుంది.

కాంతి, శ్రీకర్‌లకి నా ముద్దులు. అక్కడి విశేషాలతో ఉత్తరం రాయగలరు. డబ్బు ఎలా పంపాల్సిందీ మరిచి పోకుండా వెంటనే తెలియపరిచేది.

బదులు కోసం చూస్తుంటాను.

మీ తమ్ముడు
సదానందం.

మరిది సదానందానికి,

మీ వదిన స్వరాజ్యం రాయునది.

నీ ఉత్తరం అందింది. చెప్పిన వెంటనే ధాన్యం అమ్మినందుకు సంతోషం.

రేటు విషయమే కాస్త ఇదిగా ఉంది. పుట్టి ముప్పయి ఆరొందల దాకా పోతున్నాయన్నారు. నువ్వేమో ముప్పు లు నాలుగు వందలకే అమ్మానని రాశావు.

కాబట్టి రేటు మళ్ళీ ఓసారి విచారించి తేడా ఉంటే కరణంగారి దగ్గరికి వెళ్ళి మాట్లాడేది. ముందు ఈ సంగతేమిటో తెల్సుకొని ఉత్తరం రాసేది. మీ అన్నయ్యకి ఇలాంటివేం పట్టవు. ఆడదాన్ని నేను ఎన్నని చేయగల ను. ఆ డబ్బు తెప్పించుకొనే ఏర్పాటు కూడా నేనే చెయ్యాలి.

మీ పిల్ల పెళ్ళంటే గుర్తుకొచ్చింది.

ఇక్కడ కాంతికి కూడా పెళ్ళి నిశ్చయమైంది. మొన్ననే నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నాం. అంతవ రకు ఘనంగానే జరిగింది.

అబ్బాయి తరపు వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు. పలుకు బడి కలిగిన వాళ్ళు. హైదరాబాద్‌లోనే అయిదారు ఇళ్ళు ఉన్నాయి. బాగా ఖరీదైనవి. అబ్బాయికి పెద్ద షాపుంది. అందులోనే వ్యాపారం చూసుకుంటుంటాడు.

కట్నం మూడు లకారాలు దాటేటట్లుగానే ఉంది. ఇంట్లో ఉంది కాక ఇంకా పెళ్ళి ఖర్చులకని, బట్టలకని అక్కడా ఇక్కడా అప్పు చెయ్యాల్సినట్లే ఉంది.

కాబట్టి మీ అమ్మాయి సరోజ పెళ్ళికి పదివేలు సర్దడం కష్టం. ఈసారి ఎపుడయినా చూద్దాం. ఇప్పటికి మొత్తం డబ్బుకి డ్రాఫ్టు కట్టిపెట్టు. డ్రాఫ్టు కట్టేందుకు సాయం కావలసి వస్తే కరణంగారి అబ్బాయికి నేను చెప్పానని చెప్పి సాయం తీసుకో.

వచ్చే సంవత్సరానికి పొలం అమ్మేద్దామనుకుంటు న్నాం. మీ అన్నయ్య సంపాదించేది ఈ హైదరాబాద్‌లో ఇంట్లో ఒక్క మూలకి కూడా సరిపోదు. శ్రీకర్ ఇంజనీరిగ్ కోర్సుకి బాగా ఖర్చు అవుతోంది. పొలం ఎకరం ఎంత రేటు పలుకుతుందో తిరుగు ఉత్తరంలో మర్చిపోకుండా రాసేది.

ఒకవేళ ఇపుడే ఎవరైనా కొనేవాళ్ళు సిద్ధంగా ఉంటే ఆ విషయం కూడా రాసేది.

ఆఁ ఇంకో ముఖ్యమయిన మాట -

ఇంట్లో పనిపిల్ల రావడం మానేసింది. పని చేసుకోలేక నేను చచ్చిపోతున్నాను. ఇక్కడెవర్ని కదిపినా వేలు అడుగుతున్నారు. అక్కడయితే పనిపిల్లలు చీప్‌గా దొరకొచ్చు.

ఎవరైనా పనికొచ్చే వాళ్ళుంటే చూసేది. పది పన్నెండేళ్ళ పిల్లలయితే చాలు. మనం చెప్పినట్లు పడుంటారు. ఒకవేళ అట్లాంటి వాళ్ళెవరయినా మన ఊళ్ళో ఉంటే రేటు మిగితా వివరాలు కనుక్కుని, ఇంతకు ముందు మీ అన్నయ్య పనిచేసిన ఆఫీసులో నర్సిమ్మ అని ఉంటాడు అతనికెళ్ళి చెప్పేది.

బస్సు చార్జీలవుతాయని నిర్లక్ష్యం చేయవద్దు.

కాంతి పెళ్ళికి ముందుగా ఈ పనిపిల్లని చూసి పెడితే నా నెత్తిన పాలు పోసినట్లే. ఇప్పటికే ఓసారి ఆ నర్సిమ్మకి. ఫోన్ చేసి ఓ పనిపిల్లని పట్టుకు రమ్మని చెప్పాను.

> 'మీరు ఆస్తికులా నాస్తికులా?' ప్రశ్నించాడు రఘు.
> 'ఆసిపాస్తులు లేవు కాబట్టి నాస్తికుడ్నే. కానీ భగవంతుడి దయవల్ల ఏదో సాధించ గలననే నా నమ్మకం' చెప్పాడు నాగేష్.
> — బి. రమేష్.
> మహదేవ్‌పూర్

ఏందిలే అనుకోకుండా ధాన్యం రేటు విషయం మరోసారి కనుక్కో.

ఉంటాను...

మీ వదిన
స్వరాజ్యం.

డియర్ నారాయణ్రావ్

క్షేమమా!

నేనిక్కడ కుశలంగా ఉన్నాను.

నువు పని చేసి వెళ్ళాక ఆ ఆఫీసులో పని చెయ్యడం నా అదృష్టం. నీలాంటి సిన్సియర్ ఆఫీసర్లు ఓ పది మంది ఉన్నా చాలు ఈ దేశం ఎంతో కొంత బాగుపడిపో ను.

పొగుడ్తున్నానని అనుకోవద్దు. ఇది నిజం. నిన్ను గురించి నీ ముందే వినుగుతున్న స్టాఫ్ కూడా నీ వర్క్ మైండెడ్‌నెస్ గురించి మెచ్చుకోకుండా ఉండలేరు.

ఇంతకీ నేనిపుడు వ్రాయబోతున్న విషయం, మొన్న మీ ఆవిడ ఫోన్ చేసింది. నువ్వేం అసలు ఇంటి విషయాలు పట్టించుకోవట్లేదట గదా! అలా అని మీ ఆవిడ చెప్పింది. నీ సంగతి నాకెలాగూ తెలుసు కాబట్టి నేను ఊఁ కొట్టి ఊర్కుండిపోయాను.

ఇంట్లో ఫోన్ కూడా తీయించేశావట గదా!

మీ అమ్మాయి పెళ్ళి దగ్గర పడ్తోందని ఇంట్లో పనిపిల్ల అకస్మాత్తుగా పని మానేసిందని అర్జంటుగా ఓ పనిపిల్ల కావాలని అడిగింది. మనవాడున్నాడుగా ఇలాంటి వ్యవహారాల్లో దిట్ట - వాడే నర్సిమ్మ ... వాణ్ణి పిలిపించి ఫోన్‌లో మాట్లాడించాను. నేను కూడా వాడికి చెప్పాను.

అప్పట్నుంచి వాడు పనిపిల్ల కోసం తెగ తిరుగుతూనే ఉన్నాడు. తమ పిల్లల్ని హైద్రాబాద్ పని కోసం పంపించేందుకు ఇక్కడి వాళ్ళు కూడా తెగ డిమాండ్ చేస్తున్నారట. ఒక్కొక్కరయితే తమ పిల్లని జాగ్రత్తగా చూసుకోవాలని అవసరమైన మేరకే పని చేయించుకో వాలని షరతులు పెడ్తున్నారట.

మనం చదువుకొందే గదా ఎకనమిక్సు.

అవసరం కొద్దీ గిరాకీ.

నిన్ననో మొన్ననో మీ తమ్ముడు కూడా వచ్చాడు. నర్సిమ్మని కలవమని ఉత్తరం రాసినట్లుంది మీ ఆవిడ.

ఇవీ సంగతులు.

ఎలాగైనా సరే మరో వారం రోజుల్లో పనిపిల్లని తీసుకుని అక్కడికి వస్తానని నర్సిమ్మ చెప్పమంటువ్నా డు.

ఇంకేమిటి అక్కడి నీ ఆఫీసు విశేషాలు.

త్వరలో మీటింగుంది.

అపుడు నిన్ను కలుస్తాను. నిన్ను చూసి నేనూ నేర్చుకున్నాను. ఇంత పెద్ద మ్యాటర్‌ని ఎస్టీడీల్లోనో, ఫాక్స్‌ల్లోనో, టెలెక్స్‌ల్లోనో పెట్టి మన సొమ్ము కాదని ముంచెయ్యడం తగదని ఈ ఉత్తరం రాస్తున్నాను.

ఇట్లు
నీ స్నేహితుడు
హరిప్రకాష్

శ్రీమతి స్వరాజ్యానికి,

ఎంతైనా కట్టుకున్న భార్యవి కాబట్టి గౌరవంగా సంబో ధించక తప్పడం లేదు.

నువు ఫోన్ చేశావట -ఉ నువ్వేం చేసేది నాకెపుడు తెలిసి చచ్చింది కనుక. చివరికి కన్నకూతురికి పెళ్ళి ఎపుడు సెటిల్ చేశావో చెప్పేంత కనీస జ్ఞానం ఓపిక నిదానం కూడా నీకు లేవు.

మొత్తానికి నర్సిమ్మ పనిపిల్లని పట్టుకొచ్చాడు - వాడు చేసిన పొరపాటు ఆ పనిపిల్లని నేరుగా నా దగ్గరికి తీసుకురావడం.

మాటల్లో అనుకోకుండా ఆ పిల్ల వాళ్ళ పెదనాన్న గురించి చాలా గొప్పగా చెప్పింది. అలా ఉంటాడని ఇలా ఉంటాడని ఇంద్రుడనీ చంద్రుడినీ మా గొప్పగా వర్ణించింది.

ఆ పిల్ల వాళ్ళ పెదనాన్న గురించి ఆరిందాలా అంత సంబరంగా చెప్తుంటే కాసింత సేపు నన్ను నేను మరిచి పోయాను గాని చివరికా 'పెదనాన్న'ని నేనే అని తెలిసే సరికి దుఃఖం ఆపుకోలేకపోయాను.

నీలో మమకారం ఏ కోశానా లేకుండాపోయింది.

సహాయం చేసిన వాళ్ళ పట్ల కృతజ్ఞత కూడా లేకపో యింది.

మన పెళ్ళయిన తర్వాత నాల్గు సంవత్సరాల పాటు ఏ ఉద్యోగం సద్యోగం లేక నేను, మహారాణిలా నువ్వు వాడి దగ్గర ఉద్దర కూడా తిన్న సంగతి బహుశా నువు మరిచిపోయినట్లున్నావు.

వాడి కిప్పుడేదో పిల్ల పెళ్ళికని అవసరమై సాయం చేయమని అడిగితే కచ్చితంగా కాదనేశావు.

చివరికి సొంత కూతుర్ని మనింటికి పనిపిల్లగా అమ్ముకున్నాడు.

ఈ పాపం నీకు తప్పకుండా తగుల్తుంది.

ఇక ఈ పసిపిల్లని పనిపిల్లగా మార్చి నిర్దాక్షిణ్యంగా తెలిసి తెలిసీ నీ రంపపు పళ్ళ నాలుక్కి ఆహారంగా వెయ్యదలచుకోలేదు.

అందుకే ఈ పిల్లని తీసుకుని నేను మా ఊరికెళ్ళిపో తున్నాను.

ఇన్నాళ్ళూ నీ కెలాగూ భర్తగా బ్రతకలేకపోయాను.

కనీసం బిడ్డలకన్నా తండ్రిగా బ్రతకినిచ్చావు కాదు.

అందుకే కనీసం ఓ మంచి తమ్ముడికి అన్నగా అయినా బ్రతుకుదామని వెళ్తున్నాను.

అమ్మాయి పెళ్ళిలో తండ్రిగా నా అవసరం రావచ్చు. కనీసం అప్పటికయినా నా స్థానమేమిటో తెలిసే వస్తావ నుకుంటాను.

లేదంటే నీకూ నాకూ గుడ్‌బై.

నా కోసం ఆఫీసులో ఎంక్వైయిరీ చెయ్యొద్దు.

నాకెలాగూ నీ దగ్గర నోరు లేదని స్టాఫ్ కంతా తెలుసు. కాబట్టి నేను కొత్తగా పోగొట్టుకునేదేం ఉండబో దు. కాకుంటే మళ్ళీ గేల చేస్తే నిన్నే ఇంకా రాక్షసిగా ఊహించుకొనే ప్రమాదం ఉంది.

నెల రోజులు శెలవు పెట్టాను.

మనిషిగా మారి నా కోసం తప్పకుండా వస్తావనే ఆశిస్తున్నాను.

ఉంటాను.

ధైర్యం చేసి వెళ్తున్న
నీ
బానిస [భర్త]